# ప్రేమంటే...

- శశిశర్మ

సాయంత్రం ఆరుగంటలైంది. వేణుగోపాలస్వామి ఆలయం, భక్తుల సందర్శనలతో కళకళలాడిపోతోంది. దీపాల వెలుగులో తెల్లటి పాలరాతి శ్రీకృష్ణుని విగ్రహం ఎంతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మెడలో తులసీమాల, చేతిలో వేణువు, తలపై నెమలి ఫించం, నుదుట చందన తిలకంతో స్వామి ప్రశాంత వదనంతో కనిపిస్తున్నాడు.

అప్పటికి ఇంచుమించు గంటకుపైగా నేను అక్కడి ప్రాంగణంలో ఒక మూలకి కూర్చుని వున్నాను. దర్శనం, ప్రసాదం తీసుకోవడం అన్నీ అయిపోయినా నేనక్కడే కూర్చుని వుండడం కొంతమంది ఆశ్చర్యంగా చూస్తున్నారు. నా మొహంలోని ఉదాసీనత, కనీ కనిపించకుండా నా కళ్లల్లో సుడులు తిరుగుతున్న నీరు, బహుశా కొంతమంది గమనించే వుంటారు. నేను మాత్రం వేణుగోపాలుని ఆపకుండా చూస్తున్నాను. గుడిలో మంద్రస్వరంలో మైకు పెట్టారు కాబోలు పాట వినిపిస్తోంది.


''వేణుగానలోలుని కన వేయికనులు చాలవులే'' ఎంత చక్కని సాహిత్యమది. ఆ పాటలో ఎంత మాధుర్యం. నేను అప్పుడప్పుడు బుల్లిబుల్లి కవితలు రాస్తూ వుండేదాన్ని. కవిత్వమంటే నాకు చాలా చాలా ఇష్టం. ఎన్నో వర్ణనలు, భావనలు, ఆశయాలు, ఆలోచనలు కవితా రూపంలో రాసి భద్రపరుస్తూ వుండేదాన్ని. అవి చూసుకుని మురిసిపోయేదాన్ని. ఏదైనా సుందర దృశ్యం చూసినప్పుడో, మనసు ప్రశాంతంగా వున్నప్పుడో నాకు తెలియకుండానే నాలో మంచి కవిత్వం అశువుగా వచ్చేసేది. వెంటనే ఒక నోట్ పుస్తకంలో రాసి తర్వాత అవి చూసుకుని నేనేనా ఇంతలా రాసింది అని అబ్బురపడేదాన్ని.

ప్చ్... ఇప్పుడెక్కడ కవిత్వం... రోజంతా సమస్యలతో, మనస్తాపాలతో జీవితం గడిచిపోతుంటే ఏదో నిర్లిప్తత, ఉదాసీనత... అందరూ స్వార్థపరులే. ఎవరికీ నేను అక్కర్లేదు. ఎవరికీ నాపై నిజమైన ప్రేమలేదు. అందరి కోసం నేను తాపత్రయపడడమే తప్పు... నన్ను నన్నుగా ఎవరూ ప్రేమించరు. నాకెందుకో బాల్యం గుర్తుకు వచ్చింది. నేను చిన్నప్పటి నుండి కాస్త చలాకీగా వుండేదాన్ని. కానీ నా చలాకీతనాన్ని, చురుకుని ఎవరూ గుర్తించేవారుకాదు సరికదా తిట్టిపోసేవారు. మా బామ్మయితే మరీను. ఎంతసేపు అన్నలనే సపోర్టు చేసేది. వాళ్లు మగపిల్లలట. వాళ్లే వంశాన్ని పెంచేవాళ్లట. నేనెలాగూ ఇంకొక ఇంటికి పోవలసిన దాన్నేనట. అందుకే వాళ్లేం చేసినా ఊరుకోవాలిట. తనకి వాళ్లమీదే ప్రేమెక్కువట. బామ్మ మాటలకి నాకు భలే బాధేసేది. అమ్మా నాన్నా మామయ్యలు కూడా అంతే. మగపిల్లలని వాళ్లనే ఎక్కువ ప్రేమించేవారు. మా బామ్మ, నాన్నా, అమ్మా అంటూ నేను తాపత్రయపడడమే కాని వాళ్లెందుకో నామీద అంత ప్రేమ చూపించేవారు కాదని నాకు చిన్నప్పటినుంచి బలమైన అభిప్రాయముండేది. నాలోని ఈ కవితావేశం సరదాగా చిన్న చిన్న వాక్యాలతో నేను రాసుకునే వర్ణనలని వాళ్లెప్పుడూ గుర్తించలేదు. పైగా ''ఇది కవిత్వమా, దీంట్లో అన్నీ తప్పులే'' అనేవారు. బామ్మ ఎప్పుడో పోయింది. పోతూ తన ఆస్తి మగపిల్లలకే చెందాలంటూ రాసి మరీ పోయింది. మొత్తంమీద నా చిన్నతనం నుండీ కూడా నన్నెవరూ నిజాయితీగా ప్రేమించలేదు .అని ఇప్పటిదాకా నేననుకుంటునే వున్నాను.

గుడిలో గంటలు మ్రోగుతున్నాయి. ఎవరో లయబద్ధంగా గంట వాయిస్తున్నారు. అగరొత్తుల సువాసనలతో స్వామి చిద్విలాసంగా చూస్తున్నాడు.

''నిన్ను చూడని కనులెందుకు
నిన్ను తాకని తనువెందుకు
నీ దయలేని బ్రతుకెందుకు
నీవులేని జీవితమెందుకు''!

ఎప్పుడో ఏదో సందర్భంలో నేను రాసుకున్న కవిత గుర్తుకు వచ్చింది. ఇలాంటి చిన్నచిన్న భావాలు ఎన్ని రాసుకున్నానో. ఏ సందర్భంలో ఇది రాశానబ్బా... ఆ...! అదిగో అది నా పదహారోయేట రాసుకున్న కవిత. అనిల్‌తో ప్రేమలో పడినప్పుడు రాసుకున్న కవిత. ఆ రోజులు తలుచుకుంటే నామీద నాకే ఎగతాళిగా వుంటుంది. అనిల్ నా క్లాస్‌మేట్. బాగా చదివేవాడు. తెలిసీ తెలియని వయసులో అతనప్పట్లో నాకు హీరో. అదో అమాయకత్వమైన దశ. అతను బాగా చదివేవాడని ఇష్టపడేదాన్ని. దానికి ప్రేమ అని నేనే అనేసుకున్నాను. అతను కూడా నన్ను ప్రేమిస్తున్నాడని అనుకునేదాన్ని. అతనికి నోట్స్ రాసి పుస్తకాలిచ్చి నాకు తోచినంత



సాయం చేసేదాన్ని. కానీ తీరా అతను నాకన్నా బాగా చదివే వేరొకమ్మాయితో ఎక్కువ స్నేహం చేయడం చూసి తెలివి తెచ్చుకుని చదువుపై ధ్యాస నిలపడం నేర్చుకున్నాను. కానీ అనిల్ నన్ను ప్రేమించలేదు. సాయానికి మాత్రం నేను కావాల్సి వచ్చాను అన్న నిజం తలచుకుని తలచుకుని చాలారోజులు బాధపడేదాన్ని. మొత్తంమీద అనిల్ నన్ను ప్రేమించలేదు. నాపై ఎవరికీ ప్రేమలేదు. ఇది నేను నాలో బాగా బలపరచుకున్న అభిప్రాయం. ఆ వయసు అనుభవం అది.

గుడిలో వచ్చిపోయే సందర్శకుల హడావుడి కాస్త తగ్గింది. చీకటి పడుతోంది కదా వేణుగోపాలస్వామికి ఎవరో మల్లెదండ పెద్దది వేసారు. స్వామి చాలా అందంగా కనిపిస్తున్నారు.

''నీకు నేనున్నానంటూ
ఒక్కరున్నా చాలు
నిన్ను ప్రేమించానంటే
నాకదే పదివేలు''

ఇలాంటి పిచ్చి రాతలు నా పెళ్లయ్యాక అప్పుడప్పుడు రాసేదాన్ని. ఇలాంటి కళాభిరుచి కాస్త సున్నిత మనసున్న భర్త దొరుకుతాడన్న నా ఆశ నిరాశే అయింది రమణని చూసేసరికి. పెళ్లయిన తొలి రాత్రనుకుంటాను. ''నువ్వంటే నాకెంత ఇష్టమో తెలుసా'' అతనన్నాడు. ఆ మాటలకి మురిసిపోయాను. నన్ను ప్రేమించే ఒక మంచి వ్యక్తి భర్తగా దొరికాడు అని అతనన్న ఆ ఒక్కమాటకి సంబరపడిపోయాను. ఆ తర్వాత అతనలా అనాలని ఎంతో ఆశ పడేదాన్ని. ఇంకెక్కడి ఆ ప్రేమ కబుర్లు. ఆ రాత్రితో సరి. అసలు అతను నాతో మాట్లాడే తీరికేది. మా ఆయనకి డబ్బు మీదున్న ప్రేమలో వెయ్యోవంతైనా నామీద లేదు అన్న చేదునిజం అర్థం చేసుకునేసరికి ఇద్దరు పిల్లలు పుట్టేసారు.

ఆయనకి ఏనాడూ నా ధ్యాస ఉండేదికాదు. ఆయన రాకకోసం ఆయనతో గడపడం కోసం నేనెంత ఉవ్విళ్లూరిపోయేదాన్నో ఆయనేనాడూ అర్థం చేసుకోలేదు. డబ్బు సంపాదించడం, స్నేహితులతో గడపడం ఆయనకి అత్యంత ఇష్టమైన పనులు. భార్య అనే వ్యక్తి తనకోసం

80వ పేజీ చూడండి

77వ పేజీ తరువాయి

వుందని, తన స్నేహం, తోడు కోరుకుంటోందని ఒక్కసారి కూడా ఆలోచించలేదు. పైగా ఏదైనా చెబితే ''నీకు నగలు, చీరలు, మేడలు అన్నీ కొనిస్తున్నానుకదా. ఇది చాలదా?'' అని అరిచేవారు. చీరలు, నగలు ఇవేనా జీవితమంటే? పైగా నిష్కర్షగా ''నాకు మనీ చేసుకోవడం మొదటి ప్రయారిటీ'' అనేసారు. చాలా బాధవేసింది ఆ మాటలకి.

ఏం మనిషి ఇతను? స్వచ్ఛంగా, నిర్మలంగా తన్నే నమ్ముకుని తనతోనే జీవితం గడపడంకోసం అమాయకంగా తాపత్రయపడే భార్యమీదకన్నా డబ్బు సంపాదించడంపైనా రోజుకొకళ్లని మార్చే ఆ బయట వన్నెల విసనకర్రలమీద ప్రేమా? వాళ్లు ఈయనకి మొదటి ప్రయారిటీనా? మరి ఇక నా జీవితం ఎందుకు? ఎవరికోసం? ఇలా ఎన్నోసార్లు అనుకున్నాను. ఎవరికోసం అని అనుకున్న ప్రతిసారీ నా కొడుకులిద్దరు నా కళ్లముందు కనబడేవారు. వాళ్లని తీసుకుని ఒక్కోసారి ఈయనతో తెగతెంపులు చేసుకుని నా అన్నల దగ్గరికి పోదామనుకునేదాన్ని.

అలా అనుకున్నప్పుడల్లా ఒక్క రెండు రోజులుండటేనే మొహం ముడుచుకునే వదినలు గుర్తుకు వచ్చేవారు. వాళ్లు చాకిరీ చేయలేకపోతున్నారంటూ అన్నల పూత్కారాలు గుర్తుకువచ్చేవి. చెల్లెలని అన్నలకే లేనప్పుడు ఇక వదినలకి నాపై ప్రేముంటుందని అనుకోవడం ఒట్టి భ్రమ. అన్నలనేమీ అనలేక 'కష్టమో నష్టమో భర్తతోనే వుండడం ఆడదానికి గౌరవం' అని అమ్మ అనడం మరింత బాధ కలిగించేది. ఆవిడ భయం ఆవిడది.

''నువ్వు పోతే పో. పిల్లలు మాత్రం నాకు కావాలి'' అన్నాడాయన. అంటే పిల్లలమీదైనా ప్రేముంది కానీ నామీద లేదన్నమాట.

గుడిలో స్వామికి మంగళహారతి ఇచ్చేస్తున్నట్టున్నారు. ఆ హారతి వెలుగులో ఆ మురళీమోహనుడు చాలా అందంగా మెరిసిపోతున్నాడు.

''జీవితమే ఒక పోరాటం
గెలవాలని ఒక ఆరాటం''

నేను రాసిన ఈ వాక్యాలు ఇలాంటి చిన్న కవితలే నాకు ధైర్యంచెప్పేవి. మా ఆయన నన్ను ప్రేమించకపోయినా నా బిడ్డలున్నారు చాలు అనుకున్నాను. నా ఆశలన్నీ వాళ్లపై పెట్టుకుని పెంచాను. వాళ్ల నాన్న నన్నెపుడూ ప్రేమించలేదని, నేను చిన్నతనం నుండి కూడా ఎటువంటి ప్రేమకు నోచుకోలేదని వాళ్లకు ఊహకు వస్తే తెలుస్తుందనుకున్నాను. వాళ్లే జీవితంగా బ్రతికాను. ఉన్నన్నాళ్లూ డబ్బు సంపాదించి అదంతా పిల్లలకి ఇచ్చేసి 'నువ్వెప్పుడూ ఒంటరిదానివేనంటూ' ఆయన దేవుడి దగ్గరకు వెళ్లిపోయారు. ఇన్నాళ్లకైనా నా ఒంటరితనం ఎదిగివచ్చిన కొడుకులు పోగొడతారనుకున్నాను. నేను పడిన శ్రమ, నా ప్రేమ వాళ్లు గుర్తించి నన్ను అమితంగా కోరుకుంటున్నారనుకున్నాను. వాళ్లని నేనెపుడూ ఏదీ కోరలేదు. ''తల్లిగా మీకోసం బ్రతికే వ్యక్తిగా నన్ను ప్రేమించండి'' అనే అడిగేదాన్ని. రెక్కలు వచ్చాయి. వాళ్లకి నా అవసరంలేదు. కనీ పెంచి వాళ్లకోసం అనుక్షణం తాపత్రయపడే తల్లికన్నా కొన్నిరోజుల క్రితం వాళ్ల జీవితాల్లో అడుగుపెట్టిన భార్యలపై వాళ్లకి ఎక్కువ ప్రేమ. నా మాటకు విలువలేదు. నా ప్రేమకు గుర్తింపుఅంతకన్నాలేదు. నేనిప్పుడు వాళ్లకి భారమైపోయాను. నీ దారి నువ్వు చూసుకోమన్నట్టు మాట్లాడుతున్నారు. నేనెంత ఆపుకుందామనుకున్నా ఆగని కన్నీరు.

గుడి తలుపులు మూసే వేళయింది. పూజారిగారు నా వైపు సందేహంగా చూస్తున్నారు. మెల్లగా లేచాను. తలుపులు మూసేలోపల స్వామి దర్శనం మరోసారి చేసుకుందామని వేణుగోపాలస్వామి విగ్రహం ముందు నిల్చున్నాను.

''గొప్ప జీవితమిచ్చావు తండ్రీ... జీవితంలో నన్నెవరూ నిజాయితీగా ప్రేమించని చాలా గొప్ప జీవితాన్నిచ్చావు. నేనెందరికోసం ప్రాకులాడ్డమేగానీ నన్ను నన్నుగా కోరుకున్న ఒక్క వ్యక్తి నాకు కనిపించలేదు. జీవితమంటే ఇంత వ్యర్థం అయిపోయిందేమిటి? ఎటువంటి గుర్తింపు లేకుండానే ముప్పాతిక జీవితం గడిచిపోయింది. ప్రేమలేని ఈ జీవితం ఎందుకు? ఎవరికోసం?''

కళ్లు మూసుకున్నాను. వాన వచ్చే సూచనేమో కాబోలు ఆకాశంలో ఒక్క మెరుపు మెరిసివెళ్లింది. కళ్లు మూసుకున్న నేను ఉలిక్కిపడి కళ్లు తెరిచాను.

''ఎంతసేపూ జీవితంలో ఎవరూ ప్రేమించలేదని, నా ప్రేమకు గుర్తింపులేదని బాధపడ్డానేగానీ నేనాడైనా నా జీవితాన్ని ప్రేమించానా? అసలు ప్రేమించడానికి ప్రయత్నించానా? నా జీవితాన్ని నేనే ప్రేమించడం మొదలుపెడితే ఎవరి ప్రేమ కోసమో నేను ప్రాకులాడ్డం ఎందుకు? దేన్ని ప్రేమించడానికి ప్రేమించబడడానికి నా జీవితంలో కవిత్వం అనే అపురూపమైన కళ ఉండనే వుందిగా. సరైన రీతిలో ఆలోచించి జీవితాన్ని సరైన కోణంలో నుంచి చూసినట్లయితే ఈపాటికి నా మనసులో నుండి ఎన్ని మధురమైన కవితలు పుట్టేవి? నేను చనిపోయిన తర్వాత కూడా నా కవితలలో నేను బ్రతికే వుండాలి. అప్పుడు నన్ను అందరూ ప్రేమిస్తారు. గుర్తిస్తారు. అది ప్రేమంటే. అదే అసలు జీవితమంటే. ప్రతి మనిషి తనకోసం, కేవలం తన పరిపూర్ణతకోసం జీవితాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. ఒక కూతురిగా, చెల్లిగా, భార్యగా, తల్లిగా నాటకంలో పాత్ర పోషించినట్లు రసవత్తరంగా పోషించడంవరకే నా పరిధి. ఆ పాత్రలని ఇతరులు మెచ్చారా లేదా అన్నది వారి వారి ఇష్టం. నేను మటుకు ఈ పాత్రనిచ్చిన ఈ నాటకరంగాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి.

నేను నా జీవితాన్ని వేరే విధంగా మలచుకుంటాను. నాకున్న కళాతృష్ణని కవితా రూపంలో బయటకు తెస్తాను. జీవితపు విలువలని నేర్పే మంచి మంచి కవితలు రాస్తాను. నాకిప్పుడు చాలా తక్కువ సమయం ముందుంది. దేవుడి పిలుపునెప్పుడు వస్తుందో తెలీదు. ఈలోపల నన్ను నేనే గుర్తిస్తాను. నన్ను నేనే ప్రేమించడం మొదలుపెడతాను. ప్రయత్నం చేస్తాను. ఆపై ఫలితం ఆలోచించను. బ్రతికున్న నాలుగురోజులు ప్రేమైక జీవితం గడుపుతాను. నాకిప్పుడు ఎవరిమీద ఎటువంటి భావంలేదు. నాకు ప్రశాంతతని, తృప్తిని, పరిపూర్ణతని ఇచ్చే ఆ అక్షరాలని ఆ పదాల అల్లికని ప్రేమించడం మొదలుపెడతాను.

''అమ్మా... అటు చీకటిగా వుంది. ఇదిగో ఇటువైపు వెలుతురుంది. ఈ దారిలో వెళ్లండి'' పూజారిగారు అంటున్నారు.

ఆయనకు నమస్కరించాను. వెలుగున్న ఆ దారిలో నడక సాగించాను. *



## కంట తడిపెట్టించే ప్రశ్న

బాంబుల గొడవలో ఇరుక్కున్న సంజయ్‌దత్ వ్యక్తిగత విషయాల్లో కూడా నిండా కూరుకుపోయాడు. 'బ్రెయిన్ ట్యూమర్'తో చావు బతుకుల మధ్య ఉన్న భార్య రిచాను చూడ్డానికి అమెరికా వెళ్లిన సంజయ్‌దత్‌ని కూతురు (ఏడేళ్ల) త్రిశాల మా అమ్మను ఎందుకు వదిలి పెట్టావని అడిగిందట. ఈ సంఘటన చూసిన వాళ్ల కళ్లు చెమర్చాయి(ట). కూతురు ప్రశ్నకు సంజయ్ దత్ ఏమని బదులివ్వగలడు?

-విజయార్కె

